# గల్లంతు చిరునామా

- భమిడి వెంకటేశ్వర్లు

ఇంటిముందు ఆటో ఆగిన చప్పుడు అయింది. పేపరు చదువుతున్న శ్రీరావు వీధి కిటికీలోనుంచి చూసాడు- భూషణం ఆటోదిగుతూ, సామానులు దింపుతున్నాడు. శ్రీరావు గుండెలో అలజడి బయలుదేరింది. "మళ్ళీ తగులడ్డాడు. యీసారి ఎంతకి టెండరు వేస్తాడో" అనుకుంటూ వచ్చి సోఫాలో చతికిలబడ్డాడు - ఆటో దగ్గరికి కూడా వెళ్లకుండా.

భూషణం లోపలకొస్తూ "వందరూపాయల నోటుంది... చిల్లర వుందా ... ఆటో వాడికి యివ్వాలి" శ్రీరావుని అడిగాడు.

"ఇప్పుడే పాలవాడు అడిగితే యిచ్చాను. అయినా ఆటో వాడి దగ్గరుంటుందిలే చిల్లర ... లేదంటే వాడినే తీసుకురమ్మను ... నేను వెనకాల రోడ్డులో వున్న షాపు కెడదామంటే నాకు రెండురోజుల నుంచి జ్వరంగా వుంది" అన్నాడు శ్రీరావు.

"మీ ఆవిడ లేదా" అడిగాడు భూషణం.

"ఉంది ... పూజ చేసుకుంటోంది".

"ఇంత పొద్దున్నేనా".

"తప్పదుగా ... అయినా టైము ఎంతైందని ... ఎనిమిది కావస్తోంది .... చెబుతున్నాడు శ్రీరావు.

ఆటోవాడు బయటనుండి పిలుస్తున్నాడు.

భూషణంకి షాపు వైపు వెళ్ళక తప్పలేదు.

ఈలోగా శ్రీరావు శ్రీమతి దగ్గరకెళ్ళి భూషణం వచ్చిన విషయం చెప్పాడు.

"ఇవాళైనా టెలిఫోను బిల్లు కట్టండి ... చివరి రోజు. లేదంటే పెనాల్టి కట్టాలి ..." అందామె.

ఆ టెలిఫోను బిల్లు వచ్చి పదిరోజులైంది. ఈసారి బిల్లు మూడు వేలకు పేలింది. భూషణం రెండు నెలల క్రితం వచ్చి టెలిఫోను ముందు కూర్చుని మద్రాసు, పూనా, తెనాలి, విశాఖ, కలకత్తా, అమలాపురం నరసీపట్నంలో వున్న తన వారితో ముచ్చట్లాడేడు. ఆ బిల్లు యిప్పుడొచ్చి మూడు వేలకు పేలింది.

శ్రీరావుకి టెలిఫోను అవసరం లేదు. అతని పెద్ద కూతురు డెహ్రాడూన్‌లో వుంటోంది. రెండో కూతురు బెంగుళూరులో వుంది. వారితో మాట్లాడేందుకే తను టెలిఫోన్ పెట్టించాడు. ఇంకా చుట్టాలు, స్నేహితులు బంధువులున్నారు. వీరితో టెలిఫోనులో మాట్లాడి, గవర్నమెంటుకు జమచేసేంత అవసరం ఏమీ లేదు అతనికి. వారు కార్డు ముక్క రాయరు. నగరానికి వచ్చినా శ్రీరావు యింటికి రారు - బస్సు ఛార్జీలు అవుతాయని కాబట్టి అంతవరకూ వున్న తన ఆలోచనని, మార్గాన్ని మార్చుకున్నాడు శ్రీరావు.

భూషణంది మునిసిపాలిటీ ఎద్దు టైపు. టెలిఫోన్ కనబడితే గంగ వెర్రులతో స్టైలు కొడ్తాడు. ఎవరెవరికో తను వచ్చినట్లుగా ఫోను చేసేస్తాడు - భూషణం ఆగ్రాలో వుంటాడు. అతనింట్లో ఫోనుంది. కాని ఎవరికీ ఫోన్ చేయడు - శ్రీరావుకి కూడా !

భూషణం సామాను లోపల పెట్టాడు.

శ్రీరావు పేపరు చదువుతూనే "మీ అమ్మను చూడటానికి వచ్చావా" అని భూషణంని అడిగాడు

భూషణం ముఖంలో రంగులు మారాయి.

"క్రితం సారి నువ్వు వచ్చినపుడు మీ అమ్మకి యివ్వమని, నువ్వు నాకు యిరవై రూపాయలిచ్చావు - అదిచ్చాను. నువ్వు ఆవిడని చూడకుండా వెళ్ళిపోయి నందుకు బాధపడింది" పాయింట్లోకొస్తున్నాడు శ్రీరావు.

భూషణం ముఖంలో చిరాకు కనపడింది.

శ్రీరావు మనసులో కట్టవలసిన టెలిఫోను బిల్లు కలవర పెడుతోంది.

"ఆఫీసు డ్యూటీ మీదే వచ్చావా" అడిగాడు శ్రీరావు నవ్వుతూ.

ఖంగుతిన్నాడు భూషణం. సొంత డబ్బుతో ప్రయాణం చేయడు భూషణం. మూడు, నాలుగు పనులను చేసుకుందుకు మాత్రమే అతను రైలెక్కుతాడు. ఆఫీసు పనిమీద వచ్చి, చుట్టాలింట్లో మకాం వేసి, హోటలు రశీదులు సంపాదించుకుని డబ్బు సంపాదించడం భూషణం మానిఫెస్టో లోని ముఖ్యాంశం.... ఫిలాసఫీ ....

శ్రీరావ్‌కి అది నచ్చదు.

క్రితం సారి భూషణం వచ్చినప్పుడు, శ్రీరావు ఇంట్లో దిగాడు - ఎనిమిది రోజులు. పైగా శ్రీరావు భార్యతో రాజమండ్రి వెడుతూంటే తాళంచెవి అడిగి తీసుకున్నాడు ఆ మేధావి. అతనికి మొహమాటం లేదు. సిగ్గు అసలే లేదు. ఎదుటి వారు ఏమనుకుంటారోనని కూడా అనుకోడు, ఆలోచించడు. తన పని ఎలాగైనా అయిపోవాలి, అదీ ఎదుటివాడి ఖర్చుతో. అది అతని సాంప్రదాయం.

రాజమండ్రి నుండి రాగానే యిల్లు భయంకరంగా వుంది. మంచాలు, దుప్పట్లు అడ్డదిడ్డంగా వున్నాయి. ఇంట్లో దుమ్ము రెండంగుళాలు పెరిగింది. వంటింట్లో పాత్రలు చిందర వందరగా పడి వున్నాయి. ఇక స్కూటరు సరేసరి !

"ఇంత చటుక్కున దయ చేశావేమిటి ..." అని మరోసారి అడిగాడు శ్రీరావు.

"ఇంటికి కొన్ని రిపేర్లు చేయించాలి. ఇప్పుడు అద్దెకు లేరుగా. ఇప్పుడైతే చేయించడానికి వీలవుతుంది" చెప్పాడు భూషణం వినయంగా.

"బాగుంది" అన్నాడు శ్రీరావు నవ్వుతూ.

"ఇంతకీ సిమెంటు, ఇసుక, ఇటుకలు, స్టీలు ఎంతలో వున్నాయి ధర ! కూలీ రేట్లు ఎలా ఉన్నాయి" అడిగాడతను.

"ఎలా వున్నా తప్పదుగా" ... అని మాత్రం అన్నాడు శ్రీరావు క్లుప్తంగా.

"నేను నీకు మూడువేలకు డ్రాఫ్టు పంపించాను అందిందా" చటుక్కున అడిగాడు భూషణం.

"ఎందుకూ ?"

"ఎందుకేమిటి .... క్రితంసారి మీ యింట్లో వున్నందుకు" వీరలెవల్లో అన్నాడు భూషణం.

శ్రీరావుకి కోపం వచ్చింది. "పదేళ్ళ కాలంలో నువ్వు మాయింట్లో కనీసం మూడు నాలుగు నెలలైనా వుండి వుంటావు. పెట్రోలు పాతిక ముప్ఫయ్ లీటర్లు వాడి వుంటావు.... టెలిఫోను ఎంత వాడి వుంటావో నీకు తెలియదా ... ఎప్పుడైనా రూపాయి యిచ్చావా ... ఇమ్మని అడిగానా ... నువ్విచ్చినా నేను తీసుకుంటానా .... ఇప్పుడు డ్రాఫ్టు విషయం ఎందుకొచ్చినట్టు" అని అడిగేసాడు.

భూషణం ఖంగు తిన్నాడు.

"డ్రాఫ్టు కంటే ముందు మరో విషయం తెలిసిందిలే" అన్నాడు శ్రీరావు.

"ఏమిటి"

"నువ్వు నాకు పదివేలు అప్పిచ్చినట్టు" ఎంతకీ యివ్వటం లేదని .... "

భూషణం షాక్ తిన్నాడు. "లోకులు ఏవో వాగుతూ వుంటారు. అవి పట్టించుకో కూడదు ... నేను అనలేదు కదా ..." అన్నాడు దాటవేసే ప్రయత్నంగా.

"నేనూ అందుకే ఆ విషయాన్ని అంతగా పట్టించుకోలేదు. లేకపోతే అప్పుడే ఫోనులో అడిగేసేవాడిని".

"సరేలే ... ఇక వదిలేయ్ ... ఇంతకీ డ్రాఫ్టు అందిందా" అడిగాడు భూషణం.

"నిజంగా పంపితే అందకపోదు. పోస్టలు డిలే అయ్యింటుంది... కొంపదీసి కవరు మీద నా అడ్రస్సే రాసావా లేక మీ అల్లుడి పేరు రాసావా" అంటూ నవ్వేసాడు శ్రీరావు.

భూషణం ఆశ్చర్యపోయాడు. తను డ్రాఫ్ట పంపితే ఎందుకు అందదు ?

"రిపేర్లు పెట్టుకుని నాకు డ్రాఫ్ట ఎందుకు పంపినట్టు" ఏదో గుర్తుకు రాగానే చటుక్కున అడిగాడు శ్రీరావు భూషణం ముఖంలోకి చూస్తూ.

ఏం చెప్పాలో అర్ధం కాలేదు భూషణంకు.

"నీ కొడుకు నెలలో రెండు మూడుసార్లయినా పెళ్ళాన్ని చూడటానికి బొంబాయి నుంచి వస్తుంటాడు. రెండు మూడు రోజులుండి వెళుతుంటాడు ... మొత్తానికి మీవాడు పూర్తిగా నీ టైపే" అన్నాడు శ్రీరావు.

శ్రీరావు పురాణాన్ని యీ టైపులో విప్పడం కొంచెం యిబ్బందిగానే వుంది. "మావాడు మీ యింటికి వచ్చాడా" అని మాత్రం టచ్ చేసాడు భూషణం.

"అయినా నాకు అన్నీ తెలుస్తుంటాయి. మీవాడు నీకంటె పదాకులు ఎక్కువే చదివాడు. వాడు గుడి లింగాన్నే మింగేసే రకం ... ఆరేళ్ళు తన యింట్లో వుంచుకొని చదివించిన తాతగారింటికే వెళ్ళని పెద్దమనిషి ... అమ్మమ్మని చనిపోయినప్పుడైనా చూసేందుకు వెళ్ళని మహాజ్ఞాని ... నాయనమ్మకు అయిదు రూపాయలు కూడా ఇవ్వని గొప్పవాడు .... నీకు వారసుడు వాడు ....".

భూషణంకు కోపం వచ్చింది. కాని తమాయించుకున్నాడు. అవసరం తనది .... ఎవరి కోసమో తను ఖర్చు పెట్టాలా ... అనేది ఫిలాసఫీ కాబట్టి ....

"అయినా అదంతా యిప్పుడెందుకు" అని మాత్రం అన్నాడు భూషణం నవ్వుతూ.

"సమయం వచ్చినప్పుడు మాట్లాడుకోవాలి". అది నా పద్ధతి... ఇందులో అబద్దాలు వుంటే నన్ను నిలదీసి అడుగు .... నేను నిన్ను ఎందుకు అనాలి ?" శ్రీరావు గతాన్ని అంత తేలిగ్గా వదలదలచుకోలేదు.

భూషణం ఆలోచనలు మరోవిధంగా వున్నాయి. ఇంటి మరమ్మత్తులకు ఎంత లేదన్నా పది పదిహేను వేలు కావాలి. తన దగ్గర డబ్బు లేక కాదు. తనెప్పుడూ డిపాజిట్లు చేసేస్తాడు. వడ్డీ యెత్తుకున్నా ఎక్కడ ఎలా గిల్లుకున్నా బ్యాంకు నుంచి తీయడు. అటువంటప్పుడు ఎదుటి వారికి టెండరు వేయడం అతని హాబీ. ఆ వూళ్ళోనే ముగ్గురు సోదరులున్నారు. ఈ మహానుభావుడి ఫిలాసఫీ సైకాలజీ. ఐడియాలజీ తెలుసుకోబట్టి - వారు "అణాకాసు" విదల్చరు. వారికి ఈ జ్ఞాని ద్వారా ఎంతో కొంత నష్టపోయిన అనుభవం లేకపోలేదు. పోనీ మావగారికి టెండరు వేద్దామంటే అప్పటికే రెండు మూడు లక్షలు పట్టేసిన - నొక్కేసిన ఘనత కూడా వుంది. ఇప్పుడు యింటి రిపేర్లు చేయకపోతే యింట్లోకి ఎవరూ అద్దెకు రారు. అదీ నష్టం ... ఎదుటి వాడి నష్టం - తనకు లాభం కావాలనే మంత్రాన్ని పఠిస్తాడు కాబట్టి - ఇప్పుడు డబ్బుకోసం శ్రీరావు మాత్రమే తప్పనిసరి ... తప్పదు. అందుకు అతను ఎలా మాట్లాడినా పట్టించుకోకూడదు.

"నీకేమయ్యా ... బాధ్యతలు అయిపోయాయి. పిల్లల వివాహాలు చేసేసావు. మీరిద్దరే యింక. ఖర్చులు లేవు... వచ్చే ఆదాయం బ్యాంకులో వేసుకోడమే ...." అంటు నవ్వాడు భూషణం లౌక్యంగా, చాతుర్యాన్ని ప్రదర్శిస్తూ వసుదేవుడిని గుర్తుకు తెచ్చుకున్నాడు.

"ఇంతకీ విషయం ఏమిటి" అనిమాత్రం అడిగాడు శ్రీరావు.

"చెప్పాను కదా .... ఇంటి మరమ్మత్తులకు డబ్బు కావాలి... నువ్వు సర్దుబాటు చేయాలి" అడిగేసాడు సిగ్గువిడిచి.

నిజానికి అతను మొహమాటపడడు - సిగ్గుపడడు అలాగైతే తన కడుపెలా నిండుతుంది ... జేబెలా నింపాలి ... కాబట్టి స్కాములు .... మానిఫెస్టోలు .... సరేసరి !

"నా దగ్గర డబ్బు లేకపోలేదు. కాని నేను నా భార్యాపిల్లలకు లెక్కలు చెప్పాలి. అప్పు చేయను. చేయాలనుకున్నా యిచ్చేవాడు లేదు. వాళ్ళడిగే ప్రశ్నలకు జవాబులు నాదగ్గర లేవు. అంతగా కావాలంటే నీకూ నాకు తెలిసిన వాడి దగ్గరి కెడదాం ... వడ్డీకి తీసుకోవాలి. టైము ప్రకారం చెల్లించకపోతే పరిస్థితులు తెలుసుగా !" అన్నాడు శ్రీరావు.

భూషణంకు చిరాకేసింది. కోపం పెరిగింది. "నువ్వు యిలా చేస్తావని అనుకోలేదు" అన్నాడు వెంటనే.

"నువ్వు పంపించిన డ్రాఫ్టు అందాక తీసుకో పోనీ ... ఈలోగా నీ డబ్బెట్టి పని మొదలుపెట్టు " అని సలహా యిచ్చాడు శ్రీరావు నవ్వుతూ.

భూషణం రివ్వున లేచాడు. సర్రున వెళ్ళి పోయాడు – "రేపు వస్తాను" అంటూ.


వారం తరవాత కలిసాడు భూషణం.

"నువ్వేదో మానవతా వాదివని ... ఎదుటి వాడికి సాయం చేస్తావని నమ్మాను. నువ్వు డబ్బు యివ్వకపోతే నేను మరమ్మత్తులు చేయించలేననుకున్నావేమో ... లేదా నమ్మకం లేదా ...." అంటూ వూగిపోతూ పేలసాగాడు భూషణం.

శ్రీరావు మౌనంగా వింటున్నాడు. "మరి అదే, నీకూ... నాకూ తేడా. నీలాగ నేనూ రెచ్చిపోతే ఏం లాభం! నా గౌరవం, మర్యాద కాపాడుకోవాలి కదా. డబ్బు రూల్సు నీకు తెలుసుగా ... పోనీ ఎవరో ఒకరు ఆదుకుని సాయపడ్డారుగా ..." అన్నాడు శాంతంగా.

భూషణం వెళ్ళిపోయాడు.

తనకెవరో మహానుభావుడు, మానవతా వాది సాయపడ్డాడని అనుకుంటున్నాడు భూషణం. అతని పద్ధతి, ప్రవర్తన, వ్యవహారం తెలిసిన ఏ వ్యక్తి అయినా – డబ్బు యిచ్చేప్పుడు "చాలా జాగ్రత్తలు" తీసుకుంటాడు ... ఇప్పుడు అలా "మధ్య నిలబడిన వ్యక్తి ద్వారానే" సాయపడ్డాడు శ్రీరావు. పెట్టకపోయినా, పెట్టే యిల్లు చూపించేటప్పుడు కూడా వ్యవహార దక్షత వుండాలి కదా ! ఆ మంత్రాన్నిలా ప్రయోగించాడు శ్రీరావు చాటుగా .... లేటుగా ....



పంచాంగ శ్రవణం చిత్రం : మురళి